ప్రజాశక్తి

సోమవారం 29 జులై 2024

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

దుకాణాల్లో ధరలపై ఆరా తీస్తున్న పిఒ చైతన్య

చింతూరు : వరదలను ఆసరాగా చేసుకుని బియ్యం, కూరగాయలు, ఇతర నిత్యాసవరాలను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పదని చింతూరు ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య హెచ్చరించారు. ఆదివారం పలు దుకాణాల వద్దకు వెళ్లి, కూరగాయలు, ఇతర నిత్యావసరాల ధరల పట్టికలు పెట్టాలని ఆదేశించారు.

విఆర్ పురం: మండలంలోని రేఖపల్లి, విఆర్ పురం గ్రామంలో దుకాణాలను తహవీల్దార్ మౌలానాఫజిల్ తనిఖీ చేశారు. అన్ని సరుకుల ధరలపై ఆరా తీశారు. కృత్రిమ కొరత సష్టించి కిరాణా సామాన్లు, కూరగాయలు డీజిల్ పెట్రోల్ అధిక ధరలకు అమ్ముతున్నారని తమ దృష్టికి వచ్చిందని, అలా చేయవద్దని హెచ్చరించారు.

కొనసాగుతున్న వరద ఉధృతి

- గోదారి, శబరి నదుల ఉగ్రరూపం
- ఎగపోటు నీటితో లోతట్టు జనం ఉక్కిరిబిక్కిరి
- ముంపు ప్రాంతాల్లో అధికారులు, సిపిఎం బృందాల సందర్శన
- సహాయక చర్యల్లో అధికారులతోపాటు స్వచ్ఛందసంస్థలు, దాతలు

ప్రజాశక్తి -ఎటపాక : వారం రోజులుగా తగ్గుతూ పెరుగుతున్న గోదావరి శనివారం రాత్రి 11 గంటలకు 53.80అడుగుల గరిష్ట స్థాయికి చేరుకుంది. వరదనీరునిలకడగా ఉండి తగ్గుముఖం పట్టిన గోదావరి ఆదివారం సాయంత్రానికి 49.50 వద్ద ప్రవహిస్తోంది. భద్రాచలం వద్ద గోదావరి తగ్గుముఖం పట్టినప్పటికీ కింద గ్రామాల్లో వేగంగా తగ్గుముఖం పట్టడం లేదు. దీంతో ఇంకా గ్రామాలు జలదిగ్బంధంలోనే ఉన్నాయి. శబరి నది ప్రవాహం కూడా పెరుగుతూ ఉండటంతో శబరి పోటుతో గోదావరి వరద ప్రభావిత గ్రామాలు ముంపు నుండి బయట పడలేక పోతున్నాయి. నందిగామ, మురుమూరు, చలంపాలెం, ఎర్రగట్టు గ్రామాలు జల దిగ్బందంలోనే ఉన్నాయి.

చింతూరు : గోదావరి శబరి నదులు అంతకంతకు పెరుగుతూ ఉగ్రరూపం దాల్చడంతో లోతట్టు ప్రాంత ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. గోదావరి ఎగువ ప్రాంతాలైన మంచిర్యాల కాళేశ్వరం, పేరూరు, ఏటూరునాగారం, దుమ్ముగూడెం వద్ద వరదనీరు గత రాత్రి భారీ స్థాయిలో పెరగడంతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టంప్రమాద స్థాయికి చేరుకుంది. ధవలేశ్వరం వద్ద హెచ్చరిక స్థాయిని దాటి వరద నీరు ప్రవహిస్తోంది. సాయంత్రం నాలుగు గంటలకు క్రమేపి తగ్గుతూ గోదావరి నీటిమట్టం రెండవ ప్రమాద హెచ్చరిక చేరువలో ఉంది. శబరి నది ఎగువన ఉన్న డొంకరాయి డ్యాం నుండి నాలుగు గేట్ల ద్వారా విడుదల అవుతున్న వరదనీరు దిగువకు చేరుకొని చింతూరు వద్ద 42 అడుగులకు శబరి నది నీటిమట్టం నమోదైంది.

తాగునీటికి సైతం బాధితుల ఇక్కట్లు

వరదముంపులో చిక్కుకున్న బాధితులు అన్నివిధాలా ఇబ్బందులు పడుతున్నారు. పునరావాస కేంద్రాలకు వెళ్లాలంటే రవాణా ఛార్జీలు లేని పరిస్థితి. దాదాపు ఇరవై రోజులుగా వర్షాలతో ఇంటినుంచి బయటకు అడుగు పెట్టలేని స్థితిలో పనులు, ఆదాయం లేక ఇబ్బందులకు గురవుతున్నారు. తాగునీటికి జనం కటకటలాడే పరిస్థితి ఉంది. బోర్లన్నీ వరదనీటి ముంపులోనే ఉండడంతో మంచినీరు దొరకక అల్లాడిపోతున్నారు.

ఏజెన్సీలోని ముంపు మండలాల్లో గోదావరి, శబరి నదులు పొంగటంతో వరదలకు అతలాకుతలం..అవుతున్న బాధితులు....

చింతూరు మండల కేంద్రంలో నిలిచి ఉన్న వరదనీరు

విఆర్ పురం: గోదావరి, శబరి నదులు పొంగటంతో మండలంలోని విఆర్ పురం, ముద్దుల గూడెం, రాజుపేట, పెట్టవీధి, తదితర గ్రామాల్లోకి వరదనీరు చేరుకుంది. వరద బాధితులు సామాన్లు సర్దుకొని రేఖపల్లి పంచాయతీలో మైదాన ప్రాంతంలో గుడారాలు వేసకుని అక్కడకు చేరుకుంటున్నారు. ప్రభుత్వపరంగా బరకాలు సరఫరాగానీ, బాధితులు పునరావాస కేంద్రాలకు వెళ్లేందుకు రవాణాఛార్జీలు,ఇ తర సాయం చేయలేని పరిస్థితిలో వారంతా ఇబ్బందులకు గురౌతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ముంపు బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలింపులోనూ, సర్వం వదిలి, పునరావాస కేంద్రాలకు వచ్చిన వారికి అన్ని విధాలా ఆదుకునే చర్యలు చేపట్టాలని బాధితులు కోరుతున్నారు.

విఆర్.పురంలో రోడ్డు పక్కన వరద బాధితులు వేసుకున్న గుడారాలు

అధికారుల నిర్లక్ష్యం తగదు

కూనవరం :గోదావరి వరద బాధితుల్ని ఆదుకోవడంలో అధికారులు విఫలం అయ్యారని వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య అన్నారు. కోడేరు బొజ్జరాయిగూడెం మధ్యలో వరద నీరు నిలిచి మూడు గ్రామాలకు రాక పోకలు నిలిచినా అధికారులు కనీసం బోటు ఏర్పాటు చేయలేదన్నారు..మూడు రోజులుగా విద్యుత్ లేదని, నిత్యావసరాలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బరకాలు,కొవ్వొత్తులు ఇవ్వలేదన్నారు. సర్పంచ్ శంకర్ పాల్గొన్నారు.కాగా బొజ్జరాయిగూడెంలో వరద బాధితులకు వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సర్పంచ్ బొగ్గా రామారావు, ఉపసర్పంచ్ నానుపల్లి హరిబాబు, విఆర్ఒ అనిగి నాగరాజుబరకాలు పంపిణీ చేశారు.

ముంపు గ్రామాల్లో సిపిఎం బృందం సందర్శన

బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

విఆర్.పురం: మండలంలోని రేఖపల్లి పంచాయతీ అన్నవరం. ఉమ్మడివరం మధ్య వాగు ఉప్పొంగడంతో రాకపోకలకు బాధితులు పడుతున్న ఇబ్బందులను సిపిఎం జిల్లా నాయకులు పూనం. సత్యనారాయణ ఆధ్వర్యంలో బృందం పరిశీలించింది. రేఖపల్లి మండల కేంద్రానికి 40 గ్రామాల ప్రజలు రావాలంటే ఇదే ప్రధానమార్గమని, వాగు ముంచెత్తడంతో వారంతా అత్యవసరం, నిత్యవసరాలకు సైతం దాటిరాలేని పరిస్థితి ఉందని సిపిఎం నేతలు అంటున్నారు. తక్షణమే బోటు సదుపాయం కల్పించాలని కోరారు.

శబరి వరద నీరు పోటెత్తగడంతో నీటిముంపునకు గురైన విఆర్.పురం మండలంలోని ముల్కనపల్లి పంచాయతీ జల్లివారిగూడెం గ్రామంలోని ఇళ్లను సర్పంచ్ సవలం మారయ్యతోపాటు సిపిఎమండల కార్యదర్శి సోయం. చిన్నబాబు బృందం పరిశీలించింది.వరదదెబ్బకు ఇళ్లు వదిలిపోయిన బాధితులకు దోమతెరలు, బరకాలు, కిరోసిన్, నిత్యవసరాలు ఇవ్వాలని కోరారు. ఉప సర్పంచ్ జల్లి చిన్న తమ్మయ్య, జల్లి సత్యనారాయణ, జల్లి రాజు, మోసం సత్యనారాయణ, జల్లి శేఖర్, జల్లి. సోమరాజు ఉన్నారు.

విఆర్పురంమండలంలోని వడ్డిగూడెం పంచాయతీ ఎస్.సి. కాలనీలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం. సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆ పార్టీ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బాధితులకు పునరావాసం, ఆర్ఆర్ ప్యాకేజీ ఇచ్చిఉంటే ఏటా వీరికి ఈ పరిస్థితి వచ్చేదికాదన్నారు ఇప్పుడు కష్టాలో ఉన్న వీరిని ఆదుకోవడంలోనూ అధికారుల విఫలం చెందారని మండిపడ్డారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు సత్తిబాబు రేఖపల్లి శాఖ సెక్రెటరీ వేటగాని. సూరిబాబు, అల్లూరప్ప. ప్రకాష్, వికాస్, హాజరత్, గంగుల నరేష్ఉన్నారు

మండలంలోని రామవరం పంచాయతీ అడవి వెంకన్నగూడెం, రామవరం పాడు, రామవరం, గ్రామాల్లో మునిగిన ఇళ్లను, పునరవాస కేంద్రాలను రోడ్డుకు ఇరువైపులా వేసుకున్న గుడారాలను ఎంపిపికారం. లక్ష్మితోపాటు సిపిఎం బృందం పరిశీలించింది. గోదారి,శబరి సంగమ ప్రాంతంలో ముంపు బాధితుల ప్రజలను ఆదుకోవాలని కోరారు. సిపిఎం సీనియర్ నాయకులు కుంజ. నాగిరెడ్డి, కారం. సుందరయ్య, వడ్లాది. రమేష్ పాల్గొన్నారు.

వరద బాధిత ప్రాంతాల్లో అధికారుల పర్యటన

కొండలపై ఉన్న పునరావాస కేంద్రాలకు వెళుతున్న కలెక్టర్

చింతూరు : చింతూరు, కూనవరం మండలాల్లోని వరద బాధిత ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య సుడిగాలి పర్యటన చేశారు. బాధితులకు వరద సహాయక చర్యలను పరిశీలించారు. చింతూరు మండలంలోని గొల్ల గుప్ప, వీరపురం, కూనవరం మండలంలోని భద్రాయ గూడెం, తాళ్లగూడెం గ్రామాలకు నాటు పడవపై ప్రయాణించి వెళ్లిన కలెక్టర్, అక్కడి బాధితులకు బియ్యం, కూరగాయలు, నిత్యవసర సరుకులు, టార్పాలిన్స్, టార్చ్ లైట్లు తదితర సరుకులు అందజేశారు. చింతూరు, కూనవరం, వి ఆర్ పురం, ఏటపాక మండలాల్లో వరద సహాయక చర్యలకు నోడల్ అధికారులను నియమించినట్లు వెల్లడంచారు. బాధితులు నిర్మించుకున్న తాత్కాలిక గృహాలను పరిశీలించి, వారి ఆరోగ్య పరిస్థితులను ఆరా తీశారు. వరద బాధితులకు అంటువ్యాధులు ప్రబలకుండా ఎక్కడికక్కడే ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటుచేశామని, సమస్యలుంటే కంట్రోల్ రూమ్ లో తెలియపరచాలని కోరారు. జిల్లా కలెక్టర్ వెంట కూనవరం వరదల ప్రత్యేక అధికారి సూరజ్ గనోరే, చింతూరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కావూరి చైతన్య, తాసిల్దార్ నజీముల్లా, ఎంపిడిఒ ఎ. లక్ష్మీ రెడ్డి ఉన్నారు.

విఆర్ పురం: వరద బాధితులకు అంటువ్యాధులు ప్రబలకుండా ముమ్మర పారిశుధ్య పనులతోపాటు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు రంపచోడవరం సబ్ కలెక్టర్, వరద బాధితుల నోడల్ అధికారి ఎస్. ప్రశాంత్‌కుమార్ అన్నారు, ఆదివారం మండలంలోని వడ్డిగూడెం, ధర్మతాల గూడెం, కస్తూర్బా, హాస్టల్ మినీ గురుకులం హాస్టల్‌లో పునరావాస కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. సబ్ కలెక్టర్ వెంట తాసిల్దార్ మౌలానా పజిల్, ఎంపీడీవో ఫణేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల్లో సమస్యలపై సబ్‌కలెక్టర్ ఆరా

సహాయక చర్యల్లో స్వచ్ఛంద సంస్థలు, దాతలు

బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న దాతలు

ఎటపాక :వరద ప్రభావిత వీరయిగూడెం గ్రామస్థులకు ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, సుబంధ ఫౌండేషన్ సహకారంతో నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. వందకుటుంబాలకు ఆరు రకాల నిత్యావసరాలను అందజేసినట్లు ప్రేరణ ఫౌండేషన్ ఫౌండర్ శరత్ సుదర్శి తెలిపారు. సుబంధ ఫౌండేషన్(అమెరికా)ఫౌండర్ రవి తమ వంతు సహాయాన్ని అందించారన్నారు. పిఎన్ఎం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఐవి దాతలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సుబ్బిన్ రాజు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఐ పద్మ, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఇరప సత్యం, డివైఎఫ్ఐ నాయకులు ఆకిశెట్టి రాము, సుధాకర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జి హుస్సేన్, సీఐటీయూ నాయకులు తోట శ్రీను, పింగిలి రాంబాబు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

విఆర్ పురం: వరదలతో ఒకవైపు సతమతమౌతున్న పరిస్థితుల్లో ఆదివారం రాజుపేట కాలనీకి చెందిన ముత్యాల సత్యనారాయణ, ముంజప్పు, భార్గవ్ మరణాలతో ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలకు జెకెసి ట్రస్ట్ ద్వారా ఆయుర్వేద వైద్యులు జమాల్‌ఖాన్ ఒక్కో కుటుంబానికి రూ.మూడు వేలు చొప్పున ఆర్థికసాయం అందించి అండగా నిలిచాడు. జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, ముత్యాల రామారావు, గ్రామ పెద్దలు సర్వరాజు సాయాన్ని బాధితులకు అందజేశారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం ఇస్తున్న జెకెసి ట్రస్ట్ ప్రతినిధులు

విద్యుత్ సిబ్బంది కృషికి జేజేలు

వరదనీటిలో పడవలపై వెళ్లి విద్యుత్ పనులు చేస్తున్న అధికారులు, సిబ్బంది

కూనవరం : ఉగ్రగోదారి దెబ్బకు అష్టకష్టాల పడుతున్న బాధితులకు ఆసరాగా ఉండేందుకు ఎపిఇపిడిసిఎల్ విద్యుత్ సిబ్బంది సాహసమే చేస్తున్నారు. గోదారి నీటిమట్టం 60అడుగులు దాటినా ముంపు గ్రామాలకు ఎటువంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించేందుకు సమాయత్తమౌతున్నారు. ఇందులో భాగంగా విద్యుత్ శాఖ అధికారులు ప్రాణాలకు తెగించి నిండు గోదారిలో పడవ ప్రయాణం చేస్తూ కూనవరం దగ్గర 53 అడుగులు గోదావరి నీటిమట్టం ఉన్న విద్యుత్ ఇవ్వాలని ఉద్దేశంతో 11 కెవి విద్యుత్తు లైనును యాంగులర్ ద్వారా పైకి పంపించి 60 అడుగులు నీటి మట్టం వచ్చిన విద్యుత్ ఇవ్వడానికి సిద్ధం చేస్తున్నారు విద్యుత్ అధికారులు, సిబ్బంది సేవలపై ప్రజలు ప్రశంసలజల్లు కురిపిస్తున్నారు. కార్యక్రమంలో ఎడిఇ మలాకి, పరశురాం, పసన్న కూమార్, లక్మణ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరం

-మలేరియా, డెంగీ నియంత్రణకు కార్యాచరణ ప్రణాళిక

-ప్రజాశక్తితో పాడేరు డిఎల్‌పిఒ పిఎస్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లాలోని పాడేరు డివిజన్లో పారిశుధ్య పక్షోత్సవాలలో భాగంగా ప్రతి గ్రామంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టినట్లు పాడేరు డివిజనల్ పంచాయతీ అధికారి పీఎస్ కుమార్ వెల్లడించారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రస్తుతం ఏజెన్సీ 11 మండలాల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులపై ఇచ్చిన సమాచారం ఆయన మాటల్లోనే....

పారిశుధ్యంపై చేపడుతున్న కార్యక్రమాలు?

పాడేరు డివిజన్లోని 3,803 హెబిటేషన్లలో రోజువారి పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాం. ఆగస్టు 10 వరకు ఈ పారిశుధ్య పనులు నిర్వహించనున్నాం.

రోజువారీగా పారిశుధ్య పనులు?

ముఖ్యంగా మురికి కాలువల్లో చెత్త తొలగింపు, రహదారులు, వీధుల పరిశుభ్రత, పొదల తొలగింపు, మంచినీటి వసతుల పరిశుభ్రత పనులు, డ్రై డే పాటించడం, యాంటీ లార్వాల ఆపరేషన్, ఫాగింగ్, ప్లాంటేషన్ పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నాం.

మురుగునీటి కాలువల శుభ్రం

డివిజన్‌లో మొత్తం 265.724 కిలోమీటర్ల పొడుగున మురికి నీటి కాలువలు శుభ్రం చేస్తున్నాం. మొత్తం ఈ హ్యాబిటేషన్లలో ఒక లక్ష 73వేల 493 గిరిజన కుటుంబాలకు పారిశుధ్య సేవలు మెరుగవుతాయి..19 ట్రాక్టర్లు, 597 ట్రై సైకిల్స్, 259 ఇన్సినిరేటర్స్, ఇంకా మిస్ట్ బ్లో వర్స్ 49, ఫాగింగ్ మిషన్లు 165, హై ప్రెజర్ టాయిలెట్ క్లీనర్స్ 225 తదితర వాటిని వినియోగిస్తున్నాం.

సిబ్బంది విధులు నిర్వహణ,...

పంచాయతీల వారీగా గ్రామ కార్యదర్శులు, పంచాయితీ కార్యదర్శులు, సెక్రటేరియట్ స్టాఫ్, విలేజ్ వాలంటీర్లు, ఎక్స్టెన్షన్ ఆఫీసర్లు సుమారు 6000 మంది ఈ పారిశుధ్య పనుల్లో విధులు నిర్వహిస్తున్నారు.. అలాగే గ్రామాల్లో ఉండే మరో 600 మంది క్లాప్ మిత్రాలు ఈ పారిశుధ్య పనుల్లో భాగస్వామ్యం అయ్యారు. ఆదివారం మినహా మిగిలిన అన్ని రోజులు పారిద్యశుద్య పనులు గ్రామ గ్రామాన నిర్వహిస్తున్నాం.

వ్యాధుల నియంత్రణకు కార్యాచరణ?

గ్రామాల్లో డెంగ్యూ, మలేరియా నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నాం. ముఖ్యంగా ఈ వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉన్న పంచాయతీల్లో ఫాగింగ్ కార్యక్రమాలు చేపడుతున్నాం. మురికి కాలవల్లో దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేయడం, తాగునీటి వసతుల పరిశుభ్రతకు క్లోరినేషన్, డ్రై డే కార్యక్రమాలు, గ్రామాల్లో పబ్లిక్ హెల్త్ కార్యక్రమాల నిర్వహణకు నిధులు అందుబాటులో ఉంచి తగిన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

శంకుస్థాపన చేశారు.. వంతెన నిర్మాణం మరిచారు..

-వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న గిరిజనులు

-రెండు రోజుల క్రితం చంపపట్టి గెడ్డలో మృతదేహం తరలింపు

హుదూద్ తుపానుకు కూలిపోయిన వంతెన

గెడ్డలో మృతదేహన్ని మోసుకెళుతున్న కుటుంబీకుడు (ఫైల్ పోటొ)

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఏజెన్సీ గిరిజన ప్రాంతంలోని మారుమూల గ్రామాల్లో రవాణా సౌకర్యానికి ఇబ్బందులు కలగకుండా రోడ్డు, వంతెనలు నిర్మిస్తున్నట్లు ప్రభుత్వం చెప్తున్నా పూర్తిస్థాయిలో కల్పించిన దాఖలాలు లేవు. నిర్మించిన కొన్ని గ్రామాల్లో వంతెనలు, కాజ్వేలు, రోడ్లు మరమ్మతుకు గురైతే పున:నిర్మించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో గిరిజనులకు రోడ్డు ఉన్నప్పటికీ రవాణా కష్టాలు తప్పడం లేదు.

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు శీలంగొంది రోడ్డు చంప పట్టి గెడ్డ పొంగి ప్రవహించింది. వంతెన సౌకర్యం లేక అనారోగ్యానికి గురై అరకు ఏరియా హాస్పిటల్‌కు మృతి చెందిన ఓ గిరిజనుడి మృతదేహన్ని గ్రామానికి తరలించేందుకు ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలో మోసుకుని ఆ గ్రామస్తులు, కుటుంబీకులు తరలించిన విషాదకరమైన సంఘటన నిదర్శనంగా చెప్పవచ్చు.

మండల కేంద్రానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న శీలంగొంది రోడ్డు చంపపట్టి గేడ్డ వద్ద గతంలో గజ్వేను నిర్మించారు. 2014లో కురిసిన హుదూద్ తుఫాన్ కారణంగా వరద ఉధృతికి కాజ్వే కొట్టుకుపోయింది. అయినా ఇప్పటివరకు కాజ్వేను పునరుద్ధరించలేదు. దీంతో, ఆ గ్రామస్తులకు రోడ్డు ఉన్నప్పటికీ వంతెన సౌకర్యం లేక రవాణా కష్టాలు తప్పడం లేదు. గత పంచాయతీ ఎన్నికల ముందు స్థానిక ఎమ్మెల్యే పాల్గుణ కాజేవే పున:నిర్మించడానికి నిధులు మంజూరైనట్లు శంకుస్థాపన చేశారు. ఇప్పటివరకు సుమారు మూడేళ్లు గడుస్తున్నా ఎటువంటి పనులు ప్రారంభించలేదు. ప్రధానంగా వర్షాకాలంలో పీకల్లోతు వరకు గెడ్డ ఉదృతంగా ప్రవహిస్తున్న తప్పని పరిస్థితిలో దాటుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆ గ్రామస్తులు అంటున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా చంప పట్టి గడ్డ ఉదృతంగా ప్రవహించింది. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి కొట్టుకుపోయిన కాజ్వేను పునర్నిర్మించి పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

ప్రారంభంనాటి శిలాఫలకం

మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ధర్మన్నపడాల్, బాలదేవ్

8న ఆదివాసీ సదస్సును జయప్రదం చేయండి

ఆదివాసీ గిరిజన సంఘం పిలుపు

ప్రజాశక్తి -పాడేరు: ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 8న ఆదివాసి సమగ్రాభివృద్ధి సవాళ్లు అనే అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ గిరిజన సంఘం అల్లూరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.ధర్మన్న పడాల్, పి.బాలదేవ్ వెల్లడించారు. ఆదివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఆదివాసీ తెగలు ఎదురుకుంటున్న సమస్యలు, పరిష్కారం కోసం ఆదివాసీ రాష్ట్ర సదస్సు ను ఆగస్టు 8న పాడేరులో నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 5 వందల మంది ఆదివాసీ ఉద్యమ నాయకులు పాల్గొంటారన్నారు.ముఖ్యంగా ఆదివాసీ నిరుద్యోగ యువతకు ఉద్యోగ నియామకం, ఉద్యోగస్తుల ప్రమేషన్‌లో జరుగుతున్న అన్యాయం, జి.ఓ నెంబర్ 3పై చర్చిస్తామన్నారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్స్ పాఠశాలలో ఇతర రాష్ట్రాల వారిని నియమించి స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలకు లేకుండా చేశారన్నారు. పోడు భూములకు పట్టాలు, పోలవరం నిర్వాసితులకు పరిహారం, పునరావాసం తో పాటు ఆదివాసీ ప్రాంతాల్లో విద్య, వైద్యం మెరుగుదలకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశాలపై చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.



పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రవణ్‌కుమార్

బాధితులకు అండగా ప్రభుత్వం

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఆస్తి, పంటలు నష్టపోయిన గిరిజనులకు ప్రభుత్వం ఆదుకుంటుందని మాజీ మంత్రి శ్రవణ్ కుమార్ అన్నారు. మండలంలో టిడిపి మండల అధ్యక్షుడు టి సుబ్బారావు ఆధ్వర్యంలో చంపాపట్టి, కితలంగి కాజ్వేతో పాటు పంట పొలాలను పరిశీలించారు. వర్షాలతో నివాస గృహాలు కోల్పోయిన గిరిజన ప్రజానికానికి మంజూరు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. పంటలు, ఆస్తి నష్టపోయిన గిరిజనులు ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం ఆదుకుంటుందని ఆయన భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టి యుసి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి స్వామి, ఎంపీటీసీ సభ్యురాలు గీత, మాజీ సర్పంచి వెంకటరాజు, నాయకులు కే.సుబ్బారావు, భాస్కరరావు, సింహాద్రి పాల్గొన్నారు.

సాగరతీరానికి సందర్శకుల తాకిడి

ప్రజాశక్తి -భీమునిపట్నం : సాగరతీరం సహజంగానే సందర్శకుల రాకతో కిటకిటలాడుతుంది. ఆదివారం పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు దినం కావడంతో విద్యార్థులు, కుటుంబ సభ్యులు, యువతీ యువకులు బీచ్‌కు మరింత ఎక్కువగా వచ్చారు. సాయంకాలం పర్యాటకులు, సందర్శకులు ఎక్కువ మంది వచ్చారు.

అద్దె కొంపల్లో అంగన్వాడీ కేంద్రాలు

-పట్టించుకోని ప్రభుత్వం

-వర్షం, ఎండాకాలంలో తీవ్ర ఇబ్బందులు

అద్దె భవనంలో చదువుతున్న పిల్లలు

ప్రజాశక్తి -అనంతగిరి: అంగన్వాడీ కేంద్రాలకు సరైన భవనాలు లేక నిర్వాహకులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాతా శిశు సంక్షేమ పథకం కింద అమలు చేసే పౌష్టికాహారం రోజువారిగా క్రమం తప్పకుండా స్థానిక అంగన్వాడి నిర్వాహకులు సరఫరా చేస్తుంటారు.ప్రభుత్వం అందించే నెలవారి సరుకులను భద్రపరిచేందుకు సరైన అంగన్వాడి భవనాలు లేవు. మండలంలోని 24 పంచాయతీలలో 123 మెయిన్ కేంద్రాలు, 131 మినీ అంగన్వాడి కేంద్రాలు మొత్తం 254 ఉన్నాయి. పంచాయతీకి ఐదు నుండి ఎనిమిది అంగన్వాడీ కేంద్రాలు మాత్రమే కొనసాగుతుంటే మూడు లేదా నాలుగు కేంద్రాలకు మాత్రమే పూర్తిస్థాయి అంగన్వాడీ భవనాలు ఉన్న పరిస్థితి నెలకొంది. మిగతా కేంద్రాలు అద్దె కొంపలలో పౌష్టికాహారాలను లబ్ధిదారులకు సరఫరా చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. అనంతగిరి పంచాయతీలో 17 గ్రామాలు ఉండగా 8 గ్రామాలకు మాత్రమే కేంద్రాలు ఉన్నాయి. ఇందులో లక్ష్మీపురం, అనంతగిరి సెంటర్ 2 కు మాత్రమే భవనాలు ఉన్నాయి. అనంతగిరి వన్, బొరజోల గ్రామాలకు 2021–22 ఏడాదిలో భవనాల పనులు పూర్తి చేసినా కాంట్రాక్టర్‌కు బిల్లులు ప్రభుత్వం చెల్లించక పోవడంతో వాటిని ఐసిడిఎస్‌కు అప్పగించలేదు. పరిస్థితి మండల కేంద్రంలో ఇలా ఉందంటే మారుమూల పంచాయతీ గ్రామాల్లో చెప్పనవసరం లేదు. ప్రతి అంగన్వాడి సెంటర్‌కు పూర్తిస్థాయి భవనాలు ప్రభుత్వం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

అనంతగిరి వన్‌లో నిరుపయోగంగా ఉన్న భవనం

చిరుధాన్యాలతో పులి చిత్రం

ప్రజాశక్తి-విశాఖపట్నం : అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చిరుధాన్యాలతో పులి చిత్రాన్ని నగరానికి చెందిన చిత్రకారుడు మోకా విజయ్ కుమార్ తీర్చిదిద్దారు. ఏటా జులై 29న అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని నిర్వహిస్తారు. అంతరించిపోతున్న పులులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందనే సందేశాన్ని చాటుతూ విజయ్ కుమార్ ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు. వారం రోజులు శ్రమించి కేవలం మిల్లెట్స్‌తో ఈ చిత్రపటాన్ని రూపొందించారు.

వసతి గృహ భవనాలు నిర్మించాలి

ఎస్ఎఫ్ఐ నాయకులు కొర్ర కార్తీక్, శ్రీను

నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు:- మండలంలో జోలా పుట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరినా మరమ్మతులు చేపట్ట లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కొర్ర కార్తీక్, శ్రీను తెలిపారు. ఆదివారం జోలపుట్టు చేరుకుని పాఠశాలలో శిథిలావస్థకు చేరిన భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల వసతి గృహంలో నిర్వాహిస్తున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అనుబంధంతో నడపబడుతున్న వసతి గృహంలో 120 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. ఇది శిథిలావస్థకు చేరి కూలి పోయే దశలో ఉందన్నారు. పాఠశాల, వసతి గృహల భవనాలు గత 50 సంవత్సరం క్రితం నిర్మించినవి కావడంతో అవి ఏ సమయంలోనైనా కూలి పోయే పరిస్థితిలో ఉన్నాయని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాత్రుల్లో విద్యార్థులు నిద్రిస్తున్న సమయంలో భవనాలు కూలి ప్రమాదాలు జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ప్రభుత్వం, అధికారాలు స్పందించి నూతన భవనాల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ అసిస్టెంట్లను నియమించాలన్నారు. దుప్పట్లు, రగ్గులు, కంచాలు, పెట్టెలు విద్యార్థులకు సరఫరా చేయాలని కోరారు. సమస్యలు పరిష్కారం చేయకపోతే విద్యార్థులతో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వంతల పురిస్తన్, కమిటీ సభ్యులు కామేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బైక్ నుంచి జారిపడి మహిళ మృతి

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో కొడవటిపూడి గ్రామానికి చెందిన తేటకాల రత్నం (35) ద్విచక్ర వాహనంపై నుండి ఆదివారం జారి పడి మృతి చెందింది. వివరాల్లోకి వెళితే...కొడవటిపూడి గ్రామానికి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై ఎక్కి ఆమె వస్తోంది. మార్గ మధ్యలో జారి పడి మృతి చెందగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసుల సహాయం తీసుకుని కుటుంబ సభ్యులు స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. పోస్టు మార్టం నిర్వహించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పండ్ల మొక్కలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ కొండలరావు

పండ్ల మొక్కల పంపిణీ

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని గన్నేరుపుట్టు క్లస్టర్ పరిధి గన్నేరుపుట్టు, కుమద్దుల పంచాయితీ లోని 15గ్రామాల ప్రజలకు సుమారు 516 మొక్కలు ఆదివారం పంపిణీ చేశారు. ఏకలవ్య క్లస్టర్ ఇన్‌ఛార్జ్, వాటర్ షెడ్ ప్రాజెక్టు మేనేజర్ ఉమా వెంకటేష్, టెక్నికల్ కో ఆర్డినేటర్ చంటిబాబుల ఆధ్వర్యంలో వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు పంపిణీ చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకం తో అదనపు ఆదాయం వస్తుందన్నారు. రైతులకు ఉపాధి కల్పనలో భాగంగా మొక్కలు పంపిణీ చేయడం శుభపరిమాణన్నారు. మొక్కలు పంపిణీ చేసిన ఏకలవ్య ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం వార్డ్ మెంబర్ జన్ని విజయ్ కుమార్, వాటర్ షెడ్ ప్రెసిడెంట్ మర్రి వెంకటరావు, ఎఫ్‌పీసీ మాజీ చైర్మన్ దూసూరు నాగేశ్వరరావు, వాటర్ షెడ్ కమిటీ మెంబర్ బోయిని వెంకటరావు, రైతులు పాల్గొన్నారు.

హాజరైన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

ఘనంగా మోదమ్మ శాకాంబరీ ఉత్సవం

ప్రజాశక్తి -పాడేరు: మన్య ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం అమ్మవారికి శాకంబరీ ఉత్సవం నిర్వహించారు. ప్రతి ఏడాది ఆషాడమాసంలో ఈ ఉత్సవాన్ని ఆలయ కమిటీ ఆనవాయితీగా నిర్వహిస్తోంది.. అమ్మవారి మూలవిరాట్ విగ్రహాన్ని ఉత్సవ మూర్తిని పాదాలను శాఖములతో అలంకరించి అమ్మవారికి ధూప దీప నైవేద్యాలతో పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి హాజరై శాకాంబరి ఉత్సవాల నిర్వహణ లో భాగంగా అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో శాఖములతో వినాయకుడి విగ్రహాన్ని అమ్మవారి రూపాన్ని రూపొందించారు. ఆలయం వద్ద భక్తులు ఉదయం నుంచి భార్యలు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు అలాగే మధ్యాహ్నం సుమారు 3000 మందికి అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ తమర్భ నర్సింగరావు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటి బాబు, అడ్వకేట్ ప్రసాద్ నాయుడు, ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యం, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు...

నూతన కమిటీ సభ్యులతో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని సెలవు దినంగా ప్రకటించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్

ప్రజాశకి ్తి- రంపచోడవరం : వచ్చేనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజున ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలు, హక్కుల దినోత్సవం జరుపుకోనున్నందు ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్న కుమార్ ప్రభుత్వాన్ని కోరారు ఆదివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గణేష్ అధ్యక్షతన ఎస్ఎఫ్ఐ రంపచోడవరం ప్రాంతీయ విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కె.ప్రసన్న కుమార్ మాట్లాడుతూ రెండు రోజులుగా ఎస్ఎఫ్ఐ బృందం పలు హాస్టళ్లు, కాలేజీలు, పాఠశాలలను సందర్శించిందని, విద్యాలయాలన్నీ సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నట్లు గుర్తించామన్నారు. జూనియర్ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపల్ లేక నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, హాస్టళ్లలో మెనూ అమలుకాక, విద్యార్థులుపౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారన్నారు. గిరిజన సంక్షేమ విద్యాలయాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడిందని ఆవేదన వెలిబుచ్చారు. హాస్టళ్లలో హెల్త్‌వాలంటీర్లను నియమించాలని, జూనియర్ కాలేజీలో మధ్యాహ్నభోజనం అమలు చేయాలని, ఖాళీ అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలని కోరారు.

రంపచోడవరం ప్రాంతీయ కమిటీ ఎన్నిక

విస్తృత సమావేశంలో ఎస్ఎఫ్ఐ ప్రాంతీయ కమిటీని ఎన్నుకొన్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా సోడే గణేష్, సోడే వినోద్ ఎంపిక కాగా విద్యార్థినుల కన్వీనర్లుగా స్పందన, సౌజన్య, ఆఫీస్ బేరర్స్‌గా రాహుల్, దేవేంద్ర రెడ్డి, సారథి, సాయి తేజలతో 16మందితో కమిటీ ఎన్నుకున్నారు.

వర్షాలకు కొట్టుకుపోయిన కాజ్‌వే

ప్రజాశక్తి- రాజవొమ్మంగి : మండలంలోని నెల్లిమెట్ల కాలనీ గ్రామ సమీపంలో లాగరాయి వాగుపై నిర్మించిన కాజువే ఇటీవల వరదలకు కొంతభాగం కొట్టుకుపోయి పెద్ద గుంతలా ఏర్పడింది. దీంతో వాహనరాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గతంలో ఈ కాజ్‌వే దెబ్బతినడంతో వాహనదారులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేయగా, సంబంధిత అధికారులు స్పందించి గ్రావెల్‌తో పైపైనే మొక్కుబడిగా మరమ్మతులు చేపట్టారు .ఇటీవల కురిసన వర్షాలకు వేసిన కాజ్‌వేపై వేసిన గ్రావెల్ కొట్టుకుపోవడంతో పూర్వపుస్థితికి చేరుకుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సీజనల్ జ్వరాలపై సమీక్ష

ప్రజాశక్తి -రాజవొమ్మంగి : మండలంలో సీజనల్ జ్వరాలు, ప్రభుత్వపరంగా తీసుకుంటున్న చర్యలపై స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి సమీక్షించారు. మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో మండలంలోని మూడు పిహెచ్‌సిలు, 19 పంచాయతీలు, 16 సచివాలయాల పరిధిలో ఇంటింటా జ్వరాల సర్వే, దోమలు, లార్వాల నివారణకు చేపట్టిన చర్యలు, దోమ తెరల పంపిణీ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా గతేడాది మండలంలో 44 మలేరియా కేసులు నమోదుకాగా, ఈ ఏడాది ఇప్పటివరకు 9మలేరియా, ఒక డెంగీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయని, అలాగే 30వేల దోమతెరలు అవసరనమని ఇండెంట్ పెట్టినట్లు అధికారులు వివరించారు. వందశాతం మలేరియా నివారణ మందులు పిచికారీతోపాటు జ్వరాలపై ప్రజలకు అనునిత్యం అప్రమత్తం చేయడంతోపాటు, అవసరమైన సేవలు అందించడం ద్వారా డెంగీ, మలేరియా రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా డెంగీ నివారణ మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు.

పరిహారం, పునరావాసం కోసం జలదీక్ష

జలదీక్ష చేస్తున్న గన్నవరం, కృష్ణవరం వాసులు

ప్రజాశక్తి -ఎటపాక: గన్నవరం, కృష్ణవరం పంచాయితీల ను పోలవరం ముంపుజాబితాలో చేర్చాలని గన్నవరంలో మహిళలు, రైతులు జల దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా వరదలు వచ్చినప్పుడల్లా ఇళ్లు, పంటలు నీటమునిగి సర్వం కోల్పోతున్నామని, సీజనంతా పునరావాస కేంద్రాల్లోనే మగ్గిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టుకు తమ భూములు, ఇళ్లు, సర్వం ధారపోసిన తాము ఇబ్బందుల్లో ఉంటే ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామాల్ని పోలవరం ముంపు జాబితాలో చేర్చి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి, భూ ప్యాకేజి ఇచ్చి పునరావాసం కల్పించి ఆదుకోవాలని కోరారు.

చింతూరు. : పునరావాసం, పరిహారం కల్పించాలని కోరుతూ, ఆదివారం చింతూరు మండల కేంద్రంలో ముంపునకు గురైన ప్రధాన రహదారిపై నిర్వాసితులు రాస్తారోకో నిర్వహించారు. పోలవరం పరిహారం తక్షణమే పునరావాసం కల్పించాలని, కలెక్టర్ వచ్చి తమ సమస్యను పరిష్కరించాలని రెండు గంటలపాటు నిరసన నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక ఐటిడిఎ కావూరి చైతన్య నిరసనకారుల వద్దకు వచ్చి ముంపు మండలాల్లో సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లి నిర్దిష్టమైన లెక్కలతో కూడిన సర్వేలు, పునరావాసం భూమికి భూమి గిరిజనులకు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన ముగించారు. కార్యక్రమంలో తహసిల్దార్ నజీముల్లా షా, ఎస్సై శ్రీనివాస్ పాల్గొన్నారు.

డయేరియాతో బాలిక మృతి

స్పందన (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి -సీలేరు: వాంతులు విరోచనాలతో చిన్నారి మత్యువాత గురైన సంఘటన ఆదివారం తీవ్ర కలకలాన్ని రేపింది. జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ కమ్మరితోట గ్రామానికి చెందిన రెడ్డి బాబురావు, నీలమ్మ దంపతుల మూడేళ్ల కుమార్తె స్పందనకు శనివారం రాత్రి వాంతులు విరోచనాలై తీవ్ర అస్వస్థత గురైంది. బోరును వర్షంతోపాటు ఆసుపత్రికి తీసుకెళ్లాలంటే ఎనిమిది కిలోమీటర్ల దూరం కటిక చీకటిలో వెళ్లాల్సిన పరిస్థితుల్లో ఏం చేయాలో పాలుపోని తల్లిదండ్రులు ఉదయం వరకు వేచిచూసి, ఆదివారం ఉదయం దారకొండ పిహెచ్‌సికి తీసుకెళ్లారు. వాంతులు, విరోచనలాతో అప్పటికే డీహైడ్రేషన్‌కు గురైన స్పందనకు ఆరోగ్య సిబ్బంది వైద్యసేవలు అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. అప్పటికే ఆరోగ్యం విషమించి మృత్యువాత పడింది. స్పందన మృతితో కమ్మరతోట గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

డాక్టర్ హిమబిందు వివరణ

డయేరియా లక్షణాలతో స్పందన మృతిపై ధారకొండ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ హిమబిందు వివరణ కోరగా, వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురైన స్పందనను ఆసుపత్రికి తీసుకురావడంలో జాప్యం వల్లే మృతి చెందినట్లు నిర్ధారించారు. తమకు కనీసం సమాచారమిచ్చినా అంబులెన్స్‌ను అక్కడికి పంపి వైద్యసేవలు అందించేవారమని స్పష్టం చేశారు. అంతేకాక చిన్నారి స్పందన ఇదివరకే రక్తహీనతతో బాధపడుతోందని,దీనిపై తాము వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. ఇప్పటికే సికెల్‌సెల్ ఎనీమియా పరీక్షలు కూడా నిర్వహించామన్నారు. స్పందన మృతిపట్ల డాక్టర్ హిమబిందు ఆవేదన వ్యక్తం చేశారు. అర్ధరాత్రి సమయంలోనైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే ఆసుపత్రికి రాలేని పరిస్థితి ఉంటే, కనీసం తమకు సమాచారమివ్వాలని, తామే తగురీతిలో స్పందించి వైద్యం అందిస్తామన్నారు.

మావోయిస్టుల వారోత్సవాలతో పోలీసులు అప్రమత్తం

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : ఈనెల 28 నుంచి వచ్చేనెల 3 వరకు మావోయిస్టు అమరవీరుల వారోత్సవాల నేపథ్యంలో పోలీసుల అప్రమత్తమయ్యారు.బోయపాడు జంక్షన్ వద్ద సిఐ సన్యాసినాయుడు, రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్ఐలు, ఎపిఎస్‌పి సిబ్బందితో కలిసి ముమ్మరంగా వాహనతనిఖీలు నిర్వహిస్తున్నారు.

ఈ సందర్భంగా సిఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ, మావోయిస్టుల అమరవీరుల వారోత్సవాల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా ప్రముఖులు, హిట్‌లిస్ట్‌లో ఉన్నవారిని అప్రమత్తం చేసి మారుమూల గ్రామాలకు వెళ్లొద్దని సూచించామన్నారు. అపరిచిత వ్యక్తులు, వస్తువులపై నిఘా ఉంచి తనిఖీలు చేస్తున్నామని, ప్రజలు సమాచారమిచ్చి సహకరించాలని కోరారు.

నిలిచిన బిఎస్ఎన్ఎల్ సేవలు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం గాలికొండ పంచాయతీ సప్పర్లలోని బిఎస్ఎన్ఎల్ సెల్‌టవరులో సాంకేతిక సమస్యలతో సిగ్నల్ నిలిచిపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు గురయ్యారు. ప్రస్తుతం వర్షాల సీజన్‌లో ఈ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు సమాచార సంబంధాలు తెగిపోవడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. బిఎస్ఎన్ఎల్ అధికారులు స్పందించి సెల్ సేవలు పునరుద్ధరించాలని కోరారు.

ముగిసిన జనసేన సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి -మారేడుమిల్లి: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు మండలంలో ఈనెల 18 నుండి 28 వరకు నిర్వహించిన క్రియాశీల సభ్యత్వ నమోదు ఆదివారంతో ముగిసింది. 200 మంది సభ్యత్వాలు తీసుకున్నారని జనసేన మండల అధ్యక్షుడు మల్లా దుర్గాప్రసాద్, యూత్ ప్రెసిడెంట్ బి సత్య తెలిపారు. రూ.500 రుసుము చెల్లించి 50 మంది క్రియాశీల సభ్యత్వం తీసుకోగా, మొత్తం 200 సభ్యత్వాలు కలిగి ఉన్నారని తెలిపారు.

డొంకరాయి నుంచి నీటి విడుదల తగ్గుదల

ప్రజాశక్తి - సీలేరు: దిగువ సీలేరు డొంకరాయి జలాశయం నాలుగు గేట్లు నుంచి 13,124 క్యూసెక్కుల నీటిని దిగుప్రాంతాన్ని విడుదల చేస్తున్నామని ఇఇ(సివిల్) పి. విజయ్‌కుమార్ వెల్లడించారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీలేరు కాంప్లెక్స్ ఎపి జెన్‌కో చీఫ్ ఇంజనీరు వాసుదేవరావు ఆదివారం డొంకరాయి జలాశయాన్ని సందర్శించి రిజర్వాయరులో నీటినిల్వలు, విడుదల చేస్తున్న నీరు, ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో ఇతర వివరాలపై ఆరా తీశారన్నారు. శుక్రవారం అర్ధరాత్రి వరకు 10.936 క్యూసెక్కులు నీటిని నాలుగు గేట్లు ద్వారా దిగు ప్రాంతానికి విడుదల చేయగా, వాగులు నుంచి ఇన్‌ఫ్లో వరదనీరు డొంకరాయి జలాశయంలోకి వచ్చి చేరడంతో1035.80 అడుగుకు నీటిమట్టాలు పెరిగాయన్నారు. దీంతో నాలుగేట్లు నాలుగు అడుగులు పైకి ఎత్తి శనివారం రాత్రి రెండు గంటల నుంచి ఆదివారం సాయంత్రం మూడు గంటల వరకు 16679 క్యూసెక్కుల నీటిని దిగు ప్రాంతానికి విడుదల చేసామన్నారు. వర్షాలతోపాటు ఇన్‌ఫ్లో తగ్గడంతో డొంకరాయి జలాశయంలోకి కేవలం 1324 క్యూసెక్కులు వరద నీరు మాత్రమే వస్తోందన్నారు.దీంతో ఆదివారం సాయంత్రం 3:30 గంటలకు 5,6,7,8, గేట్లు అడుగు కిందకు దించి నీటి విడుదల తగ్గించమన్నారు. ప్రస్తుతం నాలుగు గేట్లు మూడు అడుగులుకు పరిమితం చేసి 13.124 క్యూసెక్కులు నీటిని విడుదల దిగుకు విడుదల చేస్తున్నామన్నారు. ప్రస్తుతం డొంకరాయి జలాశయంలో 1335.5 అడుగులు నీటిమట్టం స్థిరంగా ఉందన్నారు. ఏవీపీ డ్యాం ద్వారా ఇన్‌ఫ్లో తగ్గిపోవడంతో కేవలం 1000 క్యూసెక్కుల నీటిని రెండు గేట్లు ద్వారా విడుదల జరుగుతుందన్నారు. పవర్ కెనాల్ ద్వారా 3000 క్యూసెక్కులు విడుదలవుతున్న నీటితో పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో 300 మెగావాట్లు, డొంకరాయిలో జల విద్యుత్ కేంద్రంలో 15080 మెగావాట్లు, సీలేరు జల విద్యుత్ కేంద్రాలు రెండు యూనిట్లు ద్వారా 120 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని ఇఇ వాసుదేవరావు తెలిపారు. కార్యక్రమంలో ఇఇ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్థిరంగా గుంటవాడ రిజర్వాయర్ నీటిమట్టం

సీలేరు: సీలేరు కాంప్లెక్స్ పరిధి గుంటవాడ రిజర్వాయర్ నీటిమట్టాలు స్థిరంగా కొనసాగుతున్నాయని ఎపిజెన్‌కో ఎస్ఇసివిల్ చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆదివారం మాట్లాడుతూ ఐస్ గెడ్డ, కాత్రగడ్డ వాగుల నుంచి నీటి చేరికతో శనివారం నాటికి 1359.9 అడుగులు నీటిమట్టం చేరుకుందన్నారు. అయితే వర్షాలు తగ్గడంతో ఆదివారం ఉదయానికి 1358 అడుగులకు చేరినప్పటికీ, గరిష్ట నీటిమట్టం 1360 అడుగులకు చేరనందున నీటి విడుదల చేయబోమని స్పష్టం చేశారు. అయితే సీలేరు జల విద్యుత్ కేంద్రంలో రెండవ యూనిట్ వినియోగంలో రావడంతో రెగ్యురేటరీ డ్యాం గేట్లు ద్వారా 5000 క్యూసెక్కులు నీటిని విడుదల చేసి విద్యుదుత్పత్తి ప్రారంభించామన్నారు.

160 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి- రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల అధ్వర్యంలో లో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించినట్లు మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. వైద్య శిబిరంలో డాక్టర్ టివి.సుబ్బారావు, డాక్టర్ దాసరి ఉమామహేష్, డాక్టర్ ఎస్.సంపత్ కుమార్ పాల్గొని 160మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. వీరిలో 57మందికి రక్తపరీక్షలు, ఆరుగురికి థైరాయిడ్ పరీక్షలు, 8మందికి ఫిజియోథెరపీ ఆరుగురికి ఎక్స్‌రేలు, నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. వైద్యశిబిరంలో క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వాలంటీర్లు వెంకటలక్ష్మి, సంజయ్, నాయుడు, రామకృష్ణ, రవితేజ పాల్గొన్నారు.రోగులు, వారి సహాయకులకు భోజన సదుపాయం కల్పించారు.

వర్షాలకు ఇల్లు నేలమట్టం

ప్రజాశక్తి -సీలేరు: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు జికె.వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ శాండికోరి గ్రామానికి చెందిన బత్తుల మార్టిన్ ఇల్లు కూలిపోయింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో కూలిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఉన్న ఇళ్లు కూలిపోవడంతో బత్తుల మార్టిన్ కుటుంబ సభ్యులు వీధిన పడ్డారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరారు.

భారీ చెట్టు కూలడంతో రాకపోకలకు అంతరాయం

దారకొండ ఘాట్‌రోడ్‌లో దారాలమ్మ ఆలయం సమీపాన ప్రధాన రహదారిలో ఆదివారం ఉదయం భారీవృక్షం రోడ్డుకు అడ్డంగా కూలడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.సమయానికి అక్కడ వాహనదారులు, ప్రజలెవరూ లేకపోవడంతో పెద్దప్రమాదమే తప్పింది. విషయం తెలుసుకున్న చింతపల్లి డివిజన్ ఆర్అండ్‌బి అధికారులు స్పందించి, రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టును తొలగించి, రాకపోకలు పునరుద్ధరించారు. దీంతో దూర ప్రాంత ప్రయాణికులు వాహన చోదకులు ఊపిరి పీల్చుకున్నారు.